# ఆగని రేషన్ బియ్యం దందా..

- బహిరంగంగానే అక్రమ రవాణా
- అధికారుల కనుసన్నల్లోనే వ్యాపారం




పట్టుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

భైంసా, డిసెంబర్ 13 : నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యం నల్ల బజారుకు తరలుతుంది. లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని డీలర్లు అక్రమార్కులకు విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలిసిన సివిల్ సప్లయ్, రెవెన్యూ, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**గ్రామాలు.. డీలర్ల నుంచి...**

అక్రమార్కులు కొంత మేరకు బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి సేకరిస్తుండగా, మరికొంత మాత్రం డీలర్ల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. అక్రమ వ్యాపారులు గ్రామాల్లోకి వెళ్లి బియ్యాన్ని రూ. 12 నుంచి రూ. 14 కు కిలో చొప్పున సేకరిస్తున్నారని తెలిసింది. డీలర్లు కూడా లబ్ధిదారులకు బియ్యానికి బదులు తక్కువ ధరతో లెక్కగట్టి నగదు ఇస్తున్నట్లు చెబుతున్నారు.

**అర్ధరాత్రి తరలింపు**

ఇదిలా ఉండగా డీలర్లు మాత్రం తమ షాపులో నిల్వ ఉన్న బియ్యాన్ని అర్ధరాత్రి విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం పూట భైంసా టోల్‌గేట్ సమీపంలో అక్రమ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.

**బ్లాక్ మార్కెట్‌లో విక్రయం**

అక్రమార్కులు ఆయా ప్రాంతాల నుంచి తక్కువ ధరకు సేకరించిన రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాల్లో రూ. 18 నుంచి రూ. 20 లకు కిలో చొప్పున విక్రయిస్తున్నట్లు తెలుస్తున్నది. లారీలతో పాటు డీసీఎం వాహనాల్లో బియ్యాన్ని రాత్రికి రాత్రి రాష్ట్రం దాటిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.



మంగళ హారతులు, భజనలతో విఠలేశ్వర ఆలయానికి వెళ్తున్న మహాగాం గ్రామస్తులు

## అఖండ హరినామ సప్తాహం ప్రారంభం

భైంసాటౌన్, డిసెంబర్, 13 : మండలంలోని మహాగాం గ్రామ విఠల- రుక్మిణి ఆలయంలో బుధవారం అఖండ హరినామ సప్తాహం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఏడు రోజుల పాటు వైభవంగా సప్తాహం వేడుకలు జరుగనున్నాయి. ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు జ్ఞానేశ్వరి పారాయణం, రాత్రి 9 నుంచి 11 గంటల వరకు భజన, సంకీర్తన కార్యక్రమాలు జరుగుతాయి. చివరి రోజు 20వ తేదీన జాతర, అన్నదాన కార్యక్రమం ఉంటుంది.

## భైంసా వాసి మృతి

భైంసా, డిసెంబర్ 13 : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్-బాల్కొండ మధ్య మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భైంసాకు చెందిన వెంకటేశ్(25) మృతి చెందాడు. ఆర్మూర్ వైపు వాహనంలో వెళ్తుండగా ఎదురుగా మరో వాహనం ఢీకొనడం వల్ల ఆయన మృతి చెందాడు.

## అయ్యప్ప స్వాముల పాదయాత్ర



భైంసా : పాదయాత్రగా వస్తున్న స్వాములు

భైంసా, డిసెంబర్ 13 : భైంసాకు చెందిన అయ్యప్పస్వాములు అన్నపూర్ణ అయ్యప్పస్వామి ఆలయానికి పాదయాత్రగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ప్రతీ బుధవారం పాదయాత్రగా వచ్చి పూజలు నిర్వహిస్తున్నామని భక్తులు పేర్కొన్నారు. శివాజీ, వెంకటేశ్, అయ్యప్పస్వాములు తదితరులు ఉన్నారు.

**కల్లూర్‌లో..**

కుంటాల, డిసెంబర్ 13 : కల్లూర్‌లో గురుస్వామి జక్కని గజేందర్ చేతుల మీదుగా గట్టుపల్లి శ్రీనివాస్, నవీన్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా జరిగింది. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



కుంటాల : కల్లూరు అయ్యప్ప పూజల్లో పాల్గొన్న భక్తులు

## మున్నూరు కాపులకు క్షమాపణ చెప్పాలి

ఎదులాపురం, డిసెంబర్ 13 : మున్నూరు కాపు జాతిని కించపరుస్తూ ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మున్నూరు కాపు సంఘం తాలూకా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విఠల్, శ్రీనివాస్ ఖండించారు. బుధవారం ఆదిలాబాద్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు విఠల్ మాట్లాడారు. కంది శ్రీనివాస్ రెడ్డి ఇటీవల మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాతతో పాటు జాతిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోశాధికారి జైపాల్, ఉపాధ్యక్షులు పోరెడ్డి శంకర్, రాసం రాజు, సంయుక్త కార్యదర్శి విఠల్, కార్యనిర్వాహణ కార్యదర్శులు శ్రీనివాస్, ఈశ్వర్‌దాస్ పాల్గొన్నారు.

### కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 13 : ఆదిలాబాద్‌లోని కేఆర్‌కే కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని బీజేపీ నాయకులు సంతోష్, రాజు బుధవారం మున్సిపల్ కమిషనర్ శైలజను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

## స్నేహితుల చేయూత

నర్సాపూర్(జీ), డిసెంబర్ 13 : మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన అడ్వకేట్ సురకంటి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఆయన 2000-2003 సం.లో ఉస్మానియా యూనివర్సిటీలో లా కోర్సును అభ్యసించారు. విషయం తెలుసుకున్న యూనివర్సిటీ మిత్రులు బుధవారం రూ.1,50,000 ను అతడి కుమారుడికి అందించారు. సురకంటి శ్రీనివాస్ రెడ్డి తమ్ముడు రాంపూర్ సర్పంచ్ గోవింద్ రెడ్డి పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న కాలేజీ మిత్ర బృందం

## ఆలయంలో చోరీ

కుంటాల, డిసెంబర్ 13 : సూర్యాపూర్ గ్రామంలోని రాజరాజేశ్వర ఆలయంలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు హుండీ తాళం పగులగొట్టి కానుకలు ఎత్తుకెళ్లినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్ఐ దేవరావు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. శ్రావణ, కార్తీకమాసాల్లో ఈ ఆలయానికి పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి కానుకలు సమర్పించుకున్నారు. ముథోల్ నియోజకవర్గంలో ఈ ఆలయానికి ప్రత్యేకత ఉంది. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే అభ్యర్థులు ఈ ఆలయంలో పూజలు చేసిన తర్వాతే ప్రచారం ప్రారంభించారు.

## చాక్‌పల్లిలో నారుమడి పరిశీలన



నారుమడిని పరిశీలిస్తున్న ఏవో సాయికిరణ్

నర్సాపూర్(జీ), డిసెంబర్ 13 : మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో నారుమడిని వ్యవసాయ అధికారి సాయికిరణ్ పరిశీలించారు. కలుపు నివారణ సస్యరక్షణ చర్యలను రైతులకు సూచించారు. పత్తి పంటలో పత్తి ఏరడం పూర్తయిన రైతులు డిసెంబర్ 31 వరకు తమ చేనులో పత్తి కర్రలను తొలగించాలని సూచించారు. దీని వల్ల కొత్తగా వేసే పంటకు గులాబీ రంగు పురుగు ఆశించకుండా చూసుకోవాలని, తద్వారా పంటలు బాగా పండుతాయని సూచించారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలను పాటిస్తూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఇందులో రైతులు బండారి సతీశ్, బ్యాగరి భోజన్న పాల్గొన్నారు.

### గల్ఫ్ బాధితులకు అవగాహన

నిర్మల్ టౌన్, డిసెంబర్ 13 : గల్ఫ్ దేశంలో ఉపాధి అవకాశాలకు వెళ్లే వారికి బుధవారం సూచనలు ఇచ్చినట్లు ప్రవాస మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు. ఈ ప్రాంతం నుంచి దుబాయి, మస్కట్, ఖతార్, తదితర దేశాలకు వెళ్లే వారికి వీసా, అక్కడ కంపెనీల ఉద్యోగ గ్యారెంటీపై విషయాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

### రాష్ట్ర స్థాయి జట్టులో ఎంపిక కావాలి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 13 : జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జోనల్ స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అండర్-14 బాలుర, అండర్- 17 బాలికల జిల్లా స్థాయి క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్, కీపింగ్, క్యాచింగ్ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని, వారు ఈ నెల 15న నిర్మల్‌లో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కాంతారావ్, పోటీల నిర్వాహకుడు దయానంద్ రెడ్డి తెలిపారు.

### సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్, డిసెంబర్ 13 : గిరిజన సంక్షేమ శాఖ నాల్గో తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు కేబీసీ నారాయణ బుధవారం ఉట్నూర్‌లో ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఐటీడీఏలో నాల్గో తరగతి ఉద్యోగులకు సరైన వేతనం లేక, ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

### పన్నులను చెల్లించండి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 13 : ఆదిలాబాద్‌లో పన్నులు వసూలు చేయడానికి వచ్చే మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కమిషనర్ శైలజ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని ఆమె ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు పట్టణంలో ఇంటి పన్ను రూ.8 కోట్లు, నీటి బకాయిలు రూ.5 కోట్లు, రూ.కోటికిపై ట్రేడ్ లైసెన్స్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.